

చెన్నూర్‌రూరల్: మండలంలోని బుద్దారం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో అదనపు భవన నిర్మాణం చేపట్టి ఐదేళ్లకు పైగా అవుతున్నా ఇప్పటివరకు పూర్తి కాలేదు. ప్రస్తుతం ఆ భవనంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తు న్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని భవన నిర్మాణం పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



నస్పూర్: పట్టణ పరిధిలోని తీగల్‌పహాడ్ గాయత్రినగర్‌లో ఓ ఇంటి ఆవరణలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. విద్యుత్ స్తంభాన్ని మరోచోటుకు మార్చాలని విద్యుత్ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి విద్యుత్ స్తంభాన్ని మరోచోటుకు తరలించాలని బాధితులు వేడుకుంటున్నారు.



పడిపోయేలా ఉంది.. పట్టించుకోండి

మందమర్రిరూరల్: మండలంలోని పొన్నారంలో గల ఎస్సీ కాలనీలో బొజ్జ మల్లేష్ ఇంటి ఎదుట విద్యుత్ స్తంభం కింది భాగం పగిలిపోయి, వంగి ప్రమాదకరంగా ఉంది. మురుగుకాలువ అంచున విద్యుత్ స్తంభం ఒక వైపునకు వంగి విద్యుత్ తీగల సహాయంతో నిలబడి ఉంది. ఆ స్తంభం తొలగించి, కొత్తది వేయడానికి గతేడాది మరోటి తీసుకొచ్చి అక్కడే ఉంచారు. గాలిదుమారం వచ్చిందంటే విద్యుత్ స్తంభం పడిపోయి ప్రమాదం సంభవించే అవకాశం ఉందని, ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



నస్పూర్: పట్టణ పరిధిలో ఎవరైనా మృతి చెందితే వారి మృతదేహాన్ని ఉచితంగా వైకుంఠధామానికి తరలించే సౌకర్యార్థం అప్పటి మున్సిపల్ అధికారులు వైకుంఠ రథాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతిక సమస్యలతో సుమారు రెండు నెలలుగా సింగాపూర్ పాత గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో నిలిపి ఉంచారు. ఈ విషయమై కార్పొరేషన్ సిబ్బందిని సంప్రదించగా వైకుంఠ రథాన్ని త్వరలో మరమ్మతు చేయిస్తామన్నారు.

క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

జన్నారం: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడం, బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ శాసనసభలో ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీసీ సంఘాలు, ఎస్సీ కులస్తులు సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ ఫసీఉల్లా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇందయ్య తదితరులు పాల్గొన్నారు.

పొన్కల్‌లో ఇఫ్తార్



విందులో పాల్గొన్న పూర్ణచందర్‌రావు

జన్నారం: మండలంలోని పొన్కల్ మజీద్‌లో ఆదివారం సాయంత్రం ప్రముఖ మిషన్ భగీరథ కాంట్రాక్టర్ పూర్ణచందర్ రావు ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. అనంతరం 16మంది మజీద్ పెద్దలకు బట్టలు అందజేశారు. దర్గా అభివృద్ధికి రూ.1లక్ష, కబరస్తాన్‌ల వద్ద ఫ్లెటైట్‌లైట్‌లను అందజేసినట్లు ముస్లిం పెద్దలు తెలిపారు. పూర్ణచందర్ రావును ముస్లిం పెద్దలు సన్మానించారు.

బాపూజీ, అంబేడ్కర్ ఆశయాలను అమలు చేస్తాం

మంచిర్యాలటౌన్: బాపూజీ, అంబేడ్కర్‌ల ఆశయాలను అమలు చేసి, విద్వేషపూరిత రాజకీయాలకు ఆస్కారం ఇవ్వబోమని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్లో ఆదివారం జైబాపు, జైభీం, జైసంవిధాన్ సమావేశాన్ని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి గాంధీభవన్ కో ఆర్డినేటర్ రుద్ర సంతోశ్, మంచిర్యాల కో ఆర్డినేటర్ ఆసిఫ్, చెన్నూర్, బెల్లంపల్లి కో ఆర్డినేటర్ అంజన్‌కుమార్, ఆదిలాబాద్ కో ఆర్డినేటర్ దుర్గం భాస్కర్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ హాజరయ్యారు.

సీఐటీయూలో చేరిక

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని వివిధ గనులకు చెందిన పలువురు యువ కార్మికులు ఆదివారం సీఐటీయూ యూనియన్‌లో చేరారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. యూనియన్ బ్రాంచి అధ్యక్ష, ఉపాధ్యక్షులు వెంకటస్వామి, రామగిరి రామస్వామి మాట్లాడుతూ.. సింగరేణి గుర్తింపు సంఘం కార్మికుల పక్షాన బాధ్యతగా వ్యవహరించటం లేదన్నారు. కార్మికుల పక్షాన నిలబడాలని హితవు పలికారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి



మొక్కజొన్నను పరిశీలిస్తున్న రఘునాథ్

దండేపల్లి: జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ డిమాండ్ చేశారు. మండలంలోని కొర్విచెల్మలో అకాల వర్షానికి నేలవాలిన మొక్కజొన్న పంటను బీజేపీ నాయకులతో కలిసి ఆదివారం పరిశీలించారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణరావు, బీజేపీ దండేపల్లి మండల అధ్యక్షుడు రాజయ్య, నాయకులు ముఖేష్ గౌడ్, వెంకటేష్, సంతోష్, నరేష్, శేఖర్, తిరుపతి, రమేష్, సురేందర్, సత్తయ్య పాల్గొన్నారు.

హామీల అమలుకు కృషి

• మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు



నస్పూర్: రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న ప్రేంసాగర్‌రావు

నస్పూర్: ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన అన్ని హామీల అమలుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు తెలిపారు. నగర పరిధిలోని ఏపీ గార్డెన్‌లో జరిగిన కొక్కిరాల రఘుపతిరావు చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలతో సంబంధం లేకుండా నిరుపేదలకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. తాగునీటి కొరత తీర్చామని, వచ్చే నెల నుంచి అర్హులైన వారికి రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. నగర అభివృద్ధికి నిరతరం కృషి చేస్తున్నామన్నారు. సింగరేణి స్థలాల్లో స్థిర నివాసాలు ఏర్పర్చుకున్న వారికి ఇళ్ల పట్టాలు ఇప్పిస్తామని వెల్లడించారు. అర్హులైన వారికి తెల్లరేషన్ కార్డులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, మున్సిపల్ మాజీ చైర్మన్ వేణు, మాజీ కాన్సిలర్లు కుమార్, పద్మ, గెల్లు రజిత, సంధ్యారాణి పాల్గొన్నారు.

ట్రస్టు ద్వారా సేవలు కొనసాగిస్తాం

మంచిర్యాలటౌన్: రాజకీయాలకు అతీతంగా తన తండ్రి పేరిట ఏర్పాటు చేసిన కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్టు ద్వారా అందిస్తున్న సేవలను కొనసాగిస్తామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆదివారం మంచిర్యాల, హాజీపూర్ మండలాలకు చెందిన ముస్లింకు రంజాన్ తోఫాను ట్రస్టు ద్వారా పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను రాజకీయాలకు అతీతంగానే ట్రస్టు ద్వారా సేవలు అందిస్తున్నానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని, పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

• చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



కోటపల్లి: పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్

చెన్నూర్‌రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తానని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మండలంలోని పొక్కూర్‌లో పైలెట్ ప్రాజెక్ట్ కింద మంజూరైన 261మందికి ఆదివారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులతో పాటు తుర్కపల్లి రూ.15లక్షల నిధులతో సీసీ రోడ్డు, గంగారంలో రూ.30లక్షల నిధులతో అభివృద్ధి పనులు, ఎర్రగుంటపల్లిలో రూ.7లక్షలతో సిమెంట్ రోడ్డు, కొమ్మెరలో రూ.9.50లక్షల నిధులతో సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బెల్లంకొండ కరుణసాగర్‌రావు, కాంగ్రెస్ నాయకులు బాపాగౌడ్, రాజేందర్, హిమవంతరెడ్డి పాల్గొన్నారు.

చెన్నూర్: పట్టణంలోని జెండవాడ, శివాలయం వీధి, కొత్తగూడెం, బొక్కలగూడెం వాడల్లో ఆదివారం ఎమ్మెల్యే గడ్డం వివేక్ మార్నింగ్ వాక్ నిర్వహించారు. అనంతరం చెన్నూర్ పాత తహసీల్ కార్యాలయం వద్ద నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇంటి పనులను పరిశీలించారు.

కోటపల్లి: మండలాన్ని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే వివేక్ అన్నారు. రాంపూర్‌లో ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నూతనంగా నిర్మించిన హనుమాన్ అలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవేందర్‌రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: పట్టణంలోని ఏజోన్ ఏరియాలో గల మసీద్‌లో ఆదివారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో గడ్డం వివేక్ పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉంటామని ఇప్పటికే మసీదుల అభివృద్ధికి నియోజకవర్గంలో కొన్ని నిధులు కూడా కేటాయించామని పేర్కొన్నారు. ముస్లిం పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరగౌడ్

మందమర్రిరూరల్: చెన్నూర్ నియోజకవర్గంలో గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను, కాంగ్రెస్ ప్రభుత్వం అర్ధంతరంగా నిలిపివేసిందని వాటిని ప్రత్యేకనిధులు కేటాయించి వెంటనే పూర్తిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర గౌడ్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో గత ప్రభుత్వం రూ.కోట్ల నిధులతో ప్రారంభించిన కేసీఆర్ పార్క్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, చెరువు ట్యాంకుబండ్ తదితర పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. రైతు రుణమాఫీ, రైతుబంధు, రైతు భరోస వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు దుర్గం అశోక్, ఆరుముల్ల పోశం, అక్కల రమేష్, మార్త కుమారస్వామి, మల్లాల రాజమల్లు, దేవరనేని సంజీవరావు, నరేష్, దుర్గ రాజ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

జమిలి ఎన్నికలతో ఆర్థిక భారం తగ్గుతుంది



మాట్లాడుతున్న ఎస్సీ మోర్చ అధ్యక్షుడు రమేశ్

నెన్నెల: జమిలి ఎన్నికల నిర్వహణ వల్ల దేశంపై ఆర్థిక భారం తగ్గుతుందని బీజేపీ ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు కోడి రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు అంగలి శేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన 'ఒక దేశం .. ఒక ఎన్నిక' కార్యాచరణ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. దేశంలో ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలు ఒకేసారి జరిగితే ఓటర్లకు సమయం వృథా కాదన్నారు. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు ఎలాంటి ఆటంకాలు లేకుండా పొందగలుగుతారన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు శైలేందర్ సింగ్, నాయకులు వంశీ, మొగిళి, కిష్టయ్య, రాజన్న, శంకర్, మహేష్, సమ్మయ్య పాల్గొన్నారు.

ఉద్యోగుల ఫ్రెండ్లీ క్రికెట్ పోటీలు



గెలుపొందిన ఏ రిలే జట్టుతో నాయకులు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 7 గని ఉద్యోగులకు ఫ్రెండ్లీ క్రికెట్ పోటీలు నిర్వహించారు. కృష్ణాకాలనీ శాంతి స్టేడియంలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో గనిలోని అన్ని రిలేల జట్లు పాల్గొన్నాయి. ఏబీసీడీ రిలే జట్లు పాల్గొనగా ఏ రిలే జట్టు విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన జట్టును ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి బాజీసైదా, నాయకులు అశోక్, పేరం రమేశ్, బొలిశెట్టి శ్రీకాంత్, తదితరులు అభినందించారు.

పోస్టర్ ఆవిష్కరణ

నస్పూర్: నగర పరిధిలోని నస్పూర్‌కాలనీ శ్రీ లక్ష్మీ గణపతి శివ మార్కండేయ దుర్గామాత దేవాలయం ద్వితీయ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రామన్న, శ్రీనివాస్ తెలిపారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మాట్లాడారు. వేడుకలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

'అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం'

పాతమంచిర్యాల: మధ్యాహ్న భోజన కార్మికుల ముందస్తు అరెస్టులను ఖండిస్తున్నట్లు ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ ఒక ప్రకటనలో తెలిపారు. అరెస్టు చేసిన నాయకులను భేషరతుగా విడిచిపెట్టాలని ప్రకటనలో పేర్కొన్నారు.

గిరిజనులకు బట్టలు పంపిణీ

దండేపల్లి: మండలంలోని జైతుగూడ గిరిజన గ్రామానికి చెందిన పలువురు గిరిజనులకు లక్సెట్టిపేట శ్రీ శివసాయి గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో చీరలు, దోతులు, ఇతర దుస్తులు పంపిణీ చేశారు.

హనుమాన్ మాలధారణ

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి గుట్టపై గల శ్రీహనుమాన్ ఆలయం వద్ద ఆదివారం 520మంది భక్తులు హనుమాన్ దీక్షా మాలాధారణ గావించారు. దీక్షా తీసుకునే వారికి అర్చకులు మాలధారణ చేశారు. అనంతరం గుట్టపై గల సత్యనారాయణస్వామిని దర్శించుకున్నారు.

సైబర్ నేరాలపై కళాజాత

జన్నారం: మండలంలోని రోటిగూడలో ఆదివారం రాత్రి సైబర్ నేరాలు, మూఢ నమ్మకాలపై పోలీసు కళాజాత నిర్వహించారు. ఎస్సై రాజవర్ధన్ మాట్లాడుతూ.. ప్రజలు మూఢ నమ్మకాలు, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. కళాజాత బృందం, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'ప్రజా సమస్యలపై నిలదీయాలి'

పాతమంచిర్యాల: ప్రజా సమస్యలపై ప్రభుత్వాలను నిలదీయాలని బహుజన్ సమాజ్ పార్టీ సెంట్రల్ కో ఆర్డినేటర్ నిషాని రాంచందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని చార్వాక భవన్‌లో ఆదివారం పార్టీ జిల్లా నాయకుల సమావేశం నిర్వహించారు. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల కమిటీ సభ్యులను నియమించారు. జిల్లా అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్, నియోజకవర్గ అధ్యక్షుడిగా మోత్కూరీ నారాయణగౌడ్, చెన్నూర్ ఇన్‌చార్జీగా రాజు, ఆసిఫా బాద్ జిల్లా అధ్యక్షుడిగా తుకారాం, నియోజకవర్గ అధ్యక్షుడిగా కిషన్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చింతగూడలో వాలీబాల్ పోటీలు

కాసిపేట: మండలంలోని చింతగూడలో ఆదివారం ఆదర్శ యూత్ చింతగూడ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలను దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు ప్రారంభించారు. 14జట్లు పాల్గొనగా గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు.

కరపత్రాల ఆవిష్కరణ

భీమారం: శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు అంతరంగిక చైతన్యానికి యోగా, ధ్యానం ఎంతో ఉపయోగపడుతాయని శ్రీరామచంద్రామిషన్ సంస్థ ట్రెనర్ పర్శ శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలో ఈ నెల 24నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే యోగా, ధ్యానం తరగతులపై ముందస్తుగా మాట్లాడారు. ఆదివారం కరపత్రాలు ఆవిష్కరించి ఇంటింటికీ పంపిణీ చేశారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. యోగా మాస్టర్ పోటు మురళీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

మంచిర్యాలఅర్బన్: వసతి గృహాల్లో నూతన మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలని మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు అన్నారు. మంచిర్యాల బీసీ సమీకృత బాలుర వసతి గృహాన్ని ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వసతిగృహాల్లో అధికారులు విధులుపై నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నా రు. కార్యక్రమంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్ పాల్గొన్నారు.

ఆశాల ముందస్తు అరెస్ట్

చెన్నూర్: ఈ నెల 24న చలో హైదరాబాద్ కోఠి కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పోలీసులు ఆశా వర్కర్లను ఆదివారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు నిర్ణయించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు సరోజ డిమాండ్ చేశారు.

కల్యాణలక్ష్మి పేదలకు వరం

• బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వినోద్

నెన్నెల: కల్యాణ లక్ష్మి పేద కుటుంబాలకు ఓ వరంలాంటిదని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని 54మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, మండలంలో పది ఏళ్లలో జరగని అభివృద్ధిని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 12నెలల్లో చేసి చూపించానన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గట్టు మల్లేష్, హరీష్‌గౌడ్, తోట శ్రీనివాస్, మల్లాగౌడ్, ప్రకాష్‌రావు, గట్టు బానేష్, గోవింద్‌సింగ్, మొహిద్ ఖాన్, రాజన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన పనులకు శంకుస్థాపన

వేమనపల్లి: మండలంలోని చామనపల్లి, కుశ్నపల్లి గ్రామాల మధ్య ఒర్రెపై రూ.కోటి 93లక్షలతో నిర్మించే హైలెవల్ వంతెన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదివారం శంకుస్థాపన చేశారు. గ్రామాలకు అనుబంధ రోడ్లు నిర్మించేలా పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ మినిస్టర్‌తో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. నాగారం, నీల్వాయి రహదారుల అటవీ వివాదం పరిష్కారానికి నివేదిక పంపించినట్లు తెలిపారు. అనంతరం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సంతోష్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌అలీ, గాలి మధు, సత్యనారాయణ, రమేష్‌గౌడ్, రాంచందర్ పాల్గొన్నారు.

కళ్లను కాపాడుకోవాలి

బెల్లంపల్లి: సర్వేంద్రియాలలో అత్యంత ప్రధానమైన కళ్లను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. బెల్లంపల్లిలోని మహాత్మాజ్యోతిభా పూలే బాలికల గురుకుల విద్యాలయంలో ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై.. కళ్ల సమస్యలు కలిగిన 23మంది విద్యార్థులకు కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎస్.అనిత, ఆప్తమాలజిస్ట్ డాక్టర్ యశ్వంతరావు, మహాత్మా జ్యోతిభాపూలే బాలికల గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ రమాదేవి, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు పాటుపడతాం



నస్పూర్: కాగడాల ప్రదర్శనలో నాయకులు

బెల్లంపల్లి: దేశం కోసం ఉరికంబమెక్కిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల ఆశయాల సాధనకు పాటుపడతామని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. బెల్లంపల్లిలో ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతిని వేర్వేరుగా నిర్వహించారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన వర్ధంతి వేడుకల్లో ఆ పార్టీ బెల్లంపల్లి ఏరియా కార్యదర్శి జి.అశోక్, పట్టణ కార్యదర్శి రమణ భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి వెంకటేష్ తదితరులు బజారు ఏరియాలో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి విప్లవ జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చల్లూరి దేవదాస్, ఒద్ది రవీందర్, సంకీర్తన్, ఎంసీపీఐ(యూ) శ్రేణులు రమేశ్, సతీష్, పోశన్న, మహ్మద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ విగ్రహం ఏర్పాటు చేయాలి

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలో భగత్‌సింగ్ విగ్రహం ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మంచిర్యాల మార్క్స్‌భవన్‌లో ఆదివారం రాజుగురు, సుఖదేవ్, భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వంశీ, మాధవి, చైతన్య, స్వరూప, విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: భగత్‌సింగ్ వర్ధంతిని రామకృష్ణాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. బీజోన్ ఏరియా నుంచి పట్టణంలోని పురవీధుల గుండా కాగడాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాస్, వెంకటస్వామి, సత్యం, సంపత్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

నస్పూర్: భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌లో కాగాడాల ప్రదర్శన నిర్వహించి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణ శంకర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం రవి, నాయకులు పాల్గొన్నారు.

గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్టాపన

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధిలోని బూడిదగడ్డ బస్తీలో ఆదివారం భూలక్ష్మీ, మహాలక్ష్మీ గ్రామదేవతల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. సాంప్రదాయబద్ధంగా వస్తున్న ఆచార వ్యవహారాలను పాటిస్తూ గ్రామ దేవతల ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. బోనం ఎత్తుకొని డప్పు చప్పుళ్లతో శోభయాత్ర చేశారు. దూప దీప నైవేద్యాలు సమర్పించి సల్లంగా చూడాలని వేడుకున్నారు. విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే గడ్డం వినోద్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హాజరై ప్రత్యేక పూజలు చేసి ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని గ్రామ దేవతలను వేడుకున్నారు. కార్యక్రమంలో బస్తీ పెద్దలు బడికెల రమేష్, మునిమంద రమేశ్, మహిళలు, కార్మికులు, యువకులు, పిల్లలు పాల్గొన్నారు.

చల్లంగా చూడు పోచమ్మ



బోనాలతో తరలివెళ్తున్న గ్రామస్తులు

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్లారం పోచమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తా రు. వివిధ ప్రాంతాల నుంచి వాహనాల్లో తరలి వచ్చిన భక్తులు ముందుగా స్థానిక వాగులోని గుండాల్లో పుణ్య స్నానాలు చేశారు. అనంతరం బోనం వండి.. నెత్తిన పెట్టుకుని డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. పోచమ్మ తల్లికి నైవేద్యం బెల్లం, కల్లు శాఖలు సమర్పించారు. కోళ్లు, మేకలను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

కాసిపేట/మందమర్రిరూరల్: మండలంలోని సోమగూడెం, కాసిపేట, సోమగూడెం పాతబస్తీ, మందమర్రిలో ఆదివారం భక్తులు పోచమ్మకు బోనాలు సమర్పించారు. సల్లంగ చూడు తల్లీ అంటూ వేడుకున్నారు. కోళ్లు, మేకలు బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

రక్తదాన శిబిరం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.